క్లుప్తంగా

ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఉసేన్‌స్వామికి ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: రేవనూరు గ్రామంలోని ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. వచ్చే నెలలో బక్రీద్ ఉండగా ఈ వారం దర్గా భక్తులతో కిటకిటలాడింది. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్గాకు చేరుకున్నారు. జెండాలు, పూలదట్టీలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

విగ్రహ ప్రతిష్ట పూజలు ప్రారంభం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని ఎస్.చెన్నంపల్లెలో టీటీడీ, దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో గురువారం నుంచి విగ్రహ ప్రతిష్ట పూజలు ప్రారంభమయ్యాయి. వేదపండితుల ఆధ్వర్యంలో మొదటి రోజు గంగ, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, కలశస్థాపన తదితర పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాల అనంతరం శనివారం ధ్వజస్తంభ, సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు సీఎస్ఐ చర్చి ప్రారంభోత్సవం

కొలిమిగుండ్ల: నందిపాడులో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చిని శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి సీఎస్ఐ బిషప్ పెయ్యాల ఐజక్ వరప్రసాద్, భారతి హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రారంభం అనంతరం ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయన్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



బంగారు పతకం అందుకుంటున్న మోహన్‌తేజ

కోవెలకుంట్ల: జాతీయ స్థాయి ఓపెన్ బాక్సింగ్ పోటీల్లో కోవెలకుంట్లకు చెందిన మోహన్‌తేజ సత్తా చాటాడు. ఇటీవల గోవాలోని కాలింగేట్‌లో యూత్ స్పోర్ట్స్ ప్రమోటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ విభాగంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరుపున పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పట్టణానికి చెందిన వెంకటరమణ కుమారుడు మోహన్‌తేజ బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. టీం చాంపియన్‌షిప్‌తో పాటు బెస్ట్‌ఫైటర్ అవార్డు వచ్చినట్లు టీం మేనేజర్ ఆనంద్ ఆచారి, అకాడమీ కోచ్ ఫయాజ్ తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులు, స్నేహితులు అభినందించారు.

ఉమామహేశ్వరుని సేవలో శ్రీశైలం ఈఓ



ధ్వజస్తంభానికి మొక్కుకుంటున్న ఈఓ దంపతులు

బనగానపల్లె: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామిని గురువారం శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కె.శ్రీనివాసరావు దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికి దర్శనం చేయించారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్మికుల వేతనాలు పెంచాలని ఆందోళన



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మిక సంఘం నాయకులు

డోన్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు జీతాలు పెంచాలని ఏఐటీయూసీ నాయకులు అబ్బాస్, అన్వర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. కార్మికులను రెగ్యూలర్ చేయాలని..విధి నిర్వాహణలో చినపోయిన కార్మికుడి కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.

రక్తమోడుతున్న రహదారులు

- ☛ ఏప్రిల్ 20న రాఘవరాజులపల్లె వద్ద కారును బొలెరో జీపు ఢీకొనడంతో కుటుంబ సభ్యులతో కారులో ప్రయాణిస్తున్న ఆరేళ్ల జోష్నహర్షిణిరెడ్డి మృతిచెందింది. మరో ముగ్గురు గాయపడ్డారు.
- ☛ మార్చి 4వ తేదీ జమ్మలమడుగు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తాడిపత్రి వెళుతుండగా డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో కల్వటాల సమీపంలో బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 16 మంది గాయపడ్డారు.
- ☛ ఏప్రిల్ 6వ తేదీ నందిపాడు గ్రామానికి చెందిన నాగార్జున(16) బైక్‌పై సమీపంలోని తిమ్మనాయినపేట జంక్షన్ వరకు వెళ్లి తిరిగి వస్తుండగా గేదె అడ్డురావడంతో కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.
- ☛ పైనున్న మూడు ఘటనలు అతివేగం, నిర్లక్ష్యం, మైనర్ వాహనం నడపడం కారణంగా జరిగిన ప్రమాదాలే.

- అతివేగం, నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం
- రోడ్డు నిబంధనలు పాటించని జనం
- ఐదు నెలల వ్యవధిలో నలుగురు మృతి, 41 మందికి గాయాలు

కొలిమిగుండ్ల: నిర్లక్ష్యం, అవసరం లేకున్నా మితిమీరిన వేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడంతో అధికంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండల పరిధిలోని 544–డీ జాతీయ రహదారి, నెల్లూరు–ముంబై ప్రధాన రహదారుల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గాల్లో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఓవర్‌టేక్ చేయడం, ర్యాష్ డ్రైవింగ్, మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఎప్పుడు ఎక్కడ ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లో నాపరాతి గనులు ఉండడంతో వెలికితీసిన నాపరాళ్లను ఎక్కువ భాగం ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. ట్రాక్టర్ డ్రైవర్లు ఇతర వాహనాల కంటే వేగంగా వెళుతుండడం చూస్తే



పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రమాదానికి కారణమైన వాహనాలు

భయపడాల్సి వస్తుంటుంది. దీనికి తోడు పెద్ద శబ్దంతో టేప్ రికార్డులో పాటలు పెట్టుకుని డ్రైవ్ చేయడం వల్ల వెనుక వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. నియోజకవర్గంలో సిమెంట్ ఫ్యాక్టరీలు, పవర్‌గ్రిడ్ ఉండడంతో ముడిసరుకు, మట్టి, తదితర వస్తువులను రవాణ చేసేందుకు భారీ వాహనాలు తిరుగుతుంటాయి. డ్రైవింగ్ నిబంధనలు పాటించకుండానే అడ్డగోలుగా డ్రైవింగ్ చేయడం వల్లే చాలా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మైనర్లు సైతం ముగ్గురు, నలుగురు కూర్చుని బైక్‌లపై దూసుకెళుతున్నారు.

తరచూ ప్రమాదాలే

మండలంలో రెండు ప్రధాన రహదారులు ఉండడంతో భారీ వాహనాలు, కార్లు, ప్రజా రవాణ వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలోనే మండలంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. 2025లో ఐదు నెలల వ్యవధిలో ఇప్పటి వరకు నలుగురు మృత్యువాత పడగా 41 మంది గాయపడ్డారు. కస్తూర్బా పాఠశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇటిక్యాలకు చెందిన ఏసురత్నం తీవ్రంగా గాయపడి కోలుకోలేక మే 9న చనిపోయాడు. మే 10వ తేదీ కస్తూర్బా పాఠశాల సమీపంలోని మలుపు వద్ద బొలెరో వాహనం ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న విజయాచారి మృతి చెందాడు. ఇవే కాదు ఇలాంటి ప్రమాదాలు తరచూ ఎక్కడో ఒకచోట చేసుకుంటున్నాయి. అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడం వల్లే ఎక్కువగా ప్రమాలు జరుగుతున్నాయి.

నిబంధనలు పాటించాలి



వాహనదారులు నిబంధనలు పాటించాలి. ముఖ్యంగా మలుపుల వద్ద నిదానంగా వెళితే ప్రమాదాల బారినుంచి బయట పడొచ్చు. అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపరాదు. రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. తరచూ డ్రంక్‌అండ్ డ్రైవ్ పరీక్షలు చేసి జరిమానాలు విధిస్తున్నాం. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలి.

– రమేష్‌బాబు, సీఐ

హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు



ముద్దాయిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

అవుకు: హత్యాయత్నం కేసులో నిందితుడికి గురువారం మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నంద్యాల జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. అవుకు పోలీసుల వివరాల మేరకు.. 2016 మే 2వ తేదీ అవుకు పట్టణంలోని మార్కెట్ వీధికి చెందిన కంచెర్ల లక్ష్మీదేవి ఇంటి ముందు అదే వీధికి చెందిన కట్టెల వెంకటేశ్వర్లు కుమారుడు మల విసర్జన చేయడంతో గొడవ జరిగింది. కంచర్ల లక్ష్మీదేవిపై కట్టెల వెంకటేశ్వర్లు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. బాధితులు అవుకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై సెక్షన్ 326, 307 ప్రకారం హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి కేసు విచారణ సాగుతోంది. గురువారం సాక్షులను నంద్యాల జిల్లా కోర్టులో హాజరుపరిచారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.2 వేల జరిమానా విధిస్తూ నంద్యాల జిల్లా ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఎస్ తంగమణి తీర్పునిచ్చారు. హత్యాయత్నం కేసు దర్యాప్తు, సాక్షుల సేకరణతో పాటు నేరస్తులకు శిక్ష పడేలా చేసిన అవుకు పోలీసులకు జిల్లా పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు.

సోలార్ ప్రాజెక్ట్ భూముల పరిశీలన



ఉప్పలపాడు భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

అవుకు: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో ఎకోరిన్ కంపెనీ ఏర్పాటు చేయనున్న సోలార్ ప్రాజెక్టుకు అవసరమైన భూములను నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డోన్ ఆర్డీఓ నరసింహులు గురువారం పరిశీలించారు. సోలార్ ప్రాజెక్టుకు 1300 ఎకరాల ప్రభుత్వ భూములే తీసుకుంటుండడంతో ఆ భూముల తర్వాత ఉన్న పట్టా భూములకు దారి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. అలాగే ఇటీవల ఉప్పలపాడు గ్రామంలో రీసర్వే జరిగిందని.. రైతుల పట్టా భూములకు సంబంధించి రస్తాకు ప్రత్యేక ఎల్.పి.ఎం నంబర్లను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి, మండల సర్వేయర్ హరి, ఆర్ఐ వెంగల్ రెడ్డి, వీఆర్‌ఓలు ఉన్నారు.

ప్రయాణికులకు 'మహా'కష్టాలు



బస్సులు లేకపోవడంతో వేచి ఉన్న ప్రయాణికులు

బనగానపల్లె రూరల్: కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడు సభకు బనగానపల్లె డిపో నుంచి బస్సులు వెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. గురువారం ఉదయం నుంచే బస్సు సర్వీస్‌లు లేక పోవడంతో అత్యవసర, వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండి ఇబ్బందులు పడుతూ తమ ప్రయాణాలను కొనసాగించారు. బనగానపల్లె డిపోలో మొత్తం 70 బస్సులు ఉండగా వీటిలో 40 బస్సులు వెళ్లాయి. దీంతో బస్టాండ్‌లో బస్సులు లేక టీడీపీ ప్రభుత్వ తీరుపై ప్రయాణికులు మండిపడ్డారు.

స్పీడ్ బ్రేకర్లతో డేంజర్..!



ఎక్సైజ్ స్టేషన్ సమీపంలో సూచిక లేకుండా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

- సిగ్నల్స్ లేక తరుచూ ప్రమాదాలు

కోవెలకుంట్ల–నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో స్పీడ్ బ్రేకర్లతో ప్రమాదం పొంచి ఉంది. రహదారి పలుచోట్ల దెబ్బతినడంతో గత నెలలో కొన్ని చోట్ల కొత్తగా బీటీ రోడ్డు వేశారు. కోవెలకుంట్ల శివారులోని అంకాలమ్మ చౌరస్తా, ఎక్సైజ్ స్టేషన్, స్వామినగర్, గురుకుల పాఠశాల, తదితర ప్రాంతాల్లో రోడ్డుపై కొత్తగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఉన్నట్లు సిగ్నల్స్ లేకపోవడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఉన్న ప్రదేశంలో తెల్లటి చారలు, రాత్రి సమయాల్లో కన్పించే విధంగా సిగ్నల్స్ లేకపోవడంతో నంద్యాల, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, బనగానపల్లె వైపు వెళ్లే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు స్పీడ్ బ్రేకర్లను గమనించక వేగంగా బైక్‌లు నడుపుతూ స్పీడ్ బ్రేకర్ల వద్ద కిందపడి గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని స్పీడ్‌బ్రేకర్లు ఉన్న ప్రాంతాల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

–కోవెలకుంట్ల

డోన్‌ను 'మోడల్'గా తీర్చిదిద్దాం

- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- మిత్రులతో కలిసి గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనుల పరిశీలన



డోన్ మున్సిపల్ పరిపాలన భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డోన్ నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దామని.. ఇందు కోసం రూ.3 వేల కోట్లు మంజూరే చేయించామని మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన తన మిత్రులు డాక్టర్ కిరణ్, రఘునందన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డితో కలిసి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పట్టణంలో రూ.8 కోట్లతో నిర్మించిన ఆధునిక కూరగాయల మార్కెట్, రూ.6 కోట్లతో నిర్మించిన మున్సిపల్ పరిపాలన భవనం, రూ.3 కోట్లతో నిర్మించిన కేంద్రీయ విద్యాలయం, రూ.3 కోట్లతో నిర్మించిన ఆర్అండ్‌బీ వసతిగృహం, రూ.2కోట్లతో నిర్మిస్తున్న ఎంపీపీ కార్యాలయం, రూ.40కోట్లతో నిర్మించిన వంద పడకల ప్రభుత్వాస్పత్రి, రూ.3 కోట్లతో నిర్మించిన ఏపీ గురుకుల పాఠశాల భవనాలను పరిశీలించారు. అలాగే క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ.3 కోట్లతో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, క్రికెట్ ప్రాక్టీస్ నెట్ సెంటర్, రూ.5 కోట్లతో క్లబ్ హౌస్, రూ.220 కోట్లతో హంద్రీ–నీవా కాల్వ నీటితో చెరువులను నింపడం, రూ.300 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీటి సౌకర్యం, విద్యార్థుల కోసం ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గురుకుల పాఠశాలలు, గొర్రెల పెంపకం శిక్షణ కేంద్రం, వెటర్నటీ పాలిటెక్నిక్, నగరవనం, చెరువుల్లో బోటు షికారు కేంద్రాలు, వాల్మీకి గుహల అభివృద్ధి లాంటి అనేక కార్యక్రమాలను చేపట్టడమే కాకుండా ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించామని వివరించారు. 50 ఏళ్లలో జరగని అభివృద్ధి గత



హుసేనాపురంలో స్థానికులతో మాట్లాడుతున్న బుగ్గన

ప్రభుత్వంలో చేసి చూపించామని చెప్పారు. వారి వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్‌పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, నాయకులు రాజవర్ధన్, నాగభూషణంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, చంద్ర, మల్యాల శ్రీనివాసరెడ్డి, రామచంద్రుడు ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం వెటర్నరి పాలిటెక్నిక్ కళాశాలతో పాటు షెప్పర్డ్ ట్రైనింగ్ సెంటర్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం షెప్పర్డ్ ట్రైనింగ్ సెంటర్, వెటర్నటి పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించారు. తమ ప్రభుత్వ హయాంలో హుసేనాపురం గ్రామంలో రూ.18 కోట్లతో ఈ భవనాలను నిర్మించామని తెలిపారు. భవనాల్లో చిన్న చిన్న పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని.. ఈ పనులను కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ నరసింహులు, పార్టీ నాయకులు మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి రాము, నాగభూషణ్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సోమేశ్, మల్లేశ్వర్ రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్రికుంట గ్రామంలో బుగ్గనకు ఘన స్వాగతం

బేతంచెర్ల: మండల పరిధిలోని మర్రికుంట గ్రామంలో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి గ్రామస్తులు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. గురువారం గ్రామంలోని ఓ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి సమస్యలు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు మురళీధర్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు నారాయణ, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ రెడ్డి, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాటా మిషన్ల పరిశీలన



కాటా మిషన్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

అవుకు: వచ్చే నెల నుంచి రేషన్ పంపిణీ ఎండీయూ వాహనాల ద్వారా కాకుండా రేషన్ డీలర్ల వద్దే పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఎండీయూ వాహనాల నుంచి స్వాధీనం చేసుకున్న ఈపాస్ మిషన్లు, కాటా మిషన్‌లను మెట్రోలాజికల్ డిపార్ట్‌మెంట్ టెక్నికల్ అసిస్టెంట్ మహమ్మద్ గురువారం పరిశీలించారు. కాటా మిషన్‌కు సీల్ ఉందా, ఈపాస్ మిషన్‌లో సాంకేతిక సమస్య ఉందా? అని పరిశీలించారు. డేటా మొత్తాన్ని యాప్‌లో నమోదు చేశారు. మండలంలోని 41 రేషన్ దుకాణాలకు సంబంధించిన కాటా మిషన్, ఈపాస్ మిషన్లను పరిశీలించి తిరిగి వారికే అప్పగించేస్తున్నారు.

సబ్ జైల్ తనిఖీ

డోన్ టౌన్: పట్టణంలోని సబ్‌జైల్‌ను జిల్లా లీగల్ సర్వీసు అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి గురువారం తనిఖీ చేశారు. జైలు పరిసరాలు, వసతులను పరిశీలించారు. భోజన, వైద్య సదుపాయాలను ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. భోజనాలను రుచి చూశారు. అనంతరం ఖైదీలతో సమావేశమయ్యారు. నేరాలు, రిమాండ్ ఖైదీలు, వృద్ధ ఖైదీలపై ఆరా తీశారు. బెయిల్ కోసం స్వతహాగా న్యాయవాదిని నియమించుకోవడానికి ఆర్థిక స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేసి న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 70 ఏళ్లు బడిన ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జైలు సిబ్బందికి సూచించారు. జైలు సూపరింటెండెంట్ రఘునాథ రెడ్డి, లీగల్ అడ్వయిజర్ న్యాయవాది మాధవ స్వామి, కోర్టు, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి

రేషన్ దుకాణాల్లోనే సరుకుల పంపిణీ

బేతంచెర్ల: మండలంలో జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారానే బియ్యం, చక్కెర, ఇతర రేషన్ సరుకులు పంపిణీ చేస్తామని తహసీల్దార్ ప్రకాశ్ బాబు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు మాత్రమే డీలర్లు ఇంటికి వెళ్లి రేషన్ సరుకులను సరఫరా చేయాలని సూచించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బనగానపల్లె రూరల్: ప్రతి రోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని బనగానపల్లె ప్రభుత్వ యునాని వైద్యశాల మెడికల్ ఆఫీసర్ రహిమాన్ అన్నారు. గురువారం స్థానిక పొదుపు భవనంలో ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. యోగా చేయడం వల్ల ఒత్తిడి దూరం అవుతుందన్నారు. అనేక అనారోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం యోగా మాస్టర్ తిరుమలయ్య యాగాసనాలు వేసి అవగాహన కల్పించారు.

బేతంచెర్ల: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని గ్రంథాలయ అధికారి మధుశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ కార్యాక్రమంలో భాగంగా ఉపాధ్యాయురాలు కృష్ణ ప్రియ విద్యార్థులతో కథల పుస్తకాలు చదవించడంతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, యోగాసనాలు వేయించారు. పిల్లల నుంచి పెద్దల వరకు యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.



యోగా ప్రయోజనాలను వివరిస్తున్న మెడికల్ ఆఫీసర్

పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయండి



పంచాయితీ కార్యదర్శులకు సూచనలు చేస్తున్న డీపీఓ శివారెడ్డి

బనగానపల్లె రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శివారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పొదుపు భవనంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలతో పారిశుద్ధ్యం లోపించే అవకాశం ఉందని.. అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంచినీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి క్లినింగ్ చేసి ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం సర్వేలకు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. యోగాంధ్రను విజయవంతం చేయాలన్నారు. ఎంపీడీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.